



రచన : ప్రతాప వెంకట సుబ్బారాయుడు

దస్తూరీ : డా॥ జడా సుబ్బారావు

రాఘవపురం ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి చదువుతున్న రాజు, సోము పక్కపక్క ఇళ్ళలో వుంటారు. మంచి మనసున్న రాజు అందరినీ ఆదుకోవడంలో ముందుంటే, సోము మాత్రం తన వస్తువులు ఎవరికీ ఎంత అవసరం వచ్చినా ఇచ్చేవాడు కాదు.

ఆ అలవాటు మానుకోవాలని, అవసరానికి ఆదుకోవడంలో ముందుండాలని రాజు స్నేహితుడికి ఎన్నోసార్లు చెప్పాడు. కాని సోము వినేవాడు కాదు.

ఒకరోజు పరీక్షహాల్లోకి వెళ్ళబోతున్న సోముకి తను పెన్ను తెచ్చుకోలేదన్న విషయం గుర్తుకొచ్చి గుండె జారిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టి నోరెండిపోసాగింది.

అప్పటికింకా రాజు రాలేదు. స్నేహితులందర్నీ కాళ్ళావేళ్ళా బడుతూ బ్రతిమిలాడాడు. సోము సంగతి తెలిసుండడం చేత ఎవ్వరూ అతనికి పెన్ను ఇవ్వడానికి ముందుకు రాలేదు.

సోము కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ "ఒరేయ్! పరీక్ష రాయలేకపోతే సంవత్సర కాలం వృథా అయిపోతుందిరా! దయచేసి ఎవరో ఒకరు నాకు పెన్ను ఇచ్చి ఆదుకోండిరా, పుణ్యముంటుంది" అని ప్రాధేయపడ్డాడు.

ఎవరి మనసు కరగలేదు. పైగా "అవసరం అనేది ఎవరికైనా అలాగే వస్తుంది. నువ్వెప్పుడైనా ఎవరి అవసరానికైనా ఉపయోగపడ్డావా? నీ దగ్గరున్నది, నువ్వివ్వగలిగిందీ ఏనాడైనా ఇచ్చావా? నువ్వు రాయలేకపోవడమే మాకు కావాలి" అని సోముని ఈసడించుకోసాగారు.

అప్పుడే వచ్చిన రాజు సోము పరిస్థితి తెలుసుకుని తన దగ్గరున్న రెండు పెన్నుల్లోంచి ఒకటిచ్చి "త్వరగా పద సోమూ ఇప్పటికే ఆలస్యమైంది. ప్రశాంతంగా పరీక్ష రాయి" అన్నాడు.

పరీక్ష అయి బయటకొచ్చాక "రాజూ! నువ్వు కనుక పెన్ను ఇవ్వకపోతే నేను పరీక్ష రాయలేకపోయేవాడిని. వీళ్ళెవరూ నన్ను ఆదుకోలేదు" అన్నాడు బాధగా.

అందరూ "సోముకి నువ్వు పెన్ను ఎందుకిచ్చావు? ఎవరికీ సహాయం చెయ్యని వాడిని నువ్వెందుకు ఆదుకున్నావు?" అని

రాజుని అడిగారు.

"సోమూ! సాటి మనిషిని ఆదుకోవడంలోనే మనిషికి సంతృప్తి కలుగుతుంది. మనం ఇతరుల్ని కష్టాల్లో వున్నప్పుడు ఆదుకుంటే వాళ్ళు మనని ఆపద సమయాల్లో ఆదుకుంటారు. తోడుంటారు. అలాగే మీరు 'ఒక మనిషి సహాయం చేస్తేనే, మేమూ సహాయం చేస్తాము' అనేది వ్యాపార లావాదేవి అవుతుంది కాని మానవత్వమనిపించుకోదు. పశుపక్ష్యాదులకున్న గుణం, వివేకం వున్న మనకి లేకపోవడం విచారకరం" అని ముగించాడు.

అందరూ సిగ్గుతో తలవంచుకున్నారు.

సోమూ కళ్ళనీళ్ళతో "నాకు బుద్ధివచ్చింది. పొద్దున్న సంఘటన తలచుకుంటుంటే ఇప్పటికీ భయమేస్తోంది. నేను ఇవాళనుండీ నాకు తోచినంతలో అందరికీ సహాయం చేస్తాను. నీలాంటి మంచి స్నేహితుడినిచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అన్నాడు.


Add a comment...
Also post on Facebook
Posting as **Sai Somayajulu** ▾ Comment
Facebook social plugin

### మరిన్ని కథలు

- మసకబారిన మనోచిత్రం - తిరుమలశ్రీ
- జ్వాల - యజ్ఞమూర్తి




Serials
Stories
Columns
Cinema
Cartoons
Submit Article
Contact
Advertise
Old Issues

©All rights reserved to gotelugu